# కొత్తిమీర కట్ట

క్లాసులో లెక్చరరు చెప్పుకుపోతున్న జోలపాట వింటూనే, రంగురంగుల కలల అలల్లో తేలుతూ మునుగుతూ, జోగుతూ తూగుతున్న రామ్మూర్తి ఉలిక్కిపడి పైకి తేలాడు.

రామ్మూర్తి తన బంగారు కలల్లోంచి పైకి తేలాడూ అంటే దానికో బలవత్తరమైన కారణముంది. కళ్ళు పెద్దవి చేసుకుని మరీ చూశాడు. అవతలివైపు మూడో బెంచీలో ఎడంనుంచి మూడో సీట్లో కూర్చున్న ఆ కొత్తిమీరకట్ట జడ అమ్మాయి తననే చూస్తోంది కనుకొలకుల్లోంచి, వాడిగా, ఓరగా.

క్లాసయిపోయింది. రామ్మూర్తి రూం దారి పట్టాడు. వెనకాలనుంచి ఎవరిదో కోకిలా రావం 'ఏమండీ' అని విన్పించింది. తనను కాదులెమ్మనుకొని వెళ్ళిపోతున్నాడు. మళ్ళీ వినిపించింది ఇంకొంచెం దగ్గరగా, బిగ్గరగా. వెనక్కి తిరిగి చూశాడు. ఆ అమ్మాయే. 'కంగ్రాచులేషన్స్' ఎందుకో వెంటనే అర్థంకాని రామ్మూర్తి ఆశ్చర్యపోయాడు బోల్డు. 'చాలా బాగా వ్రాశారండీ... మేగజైనులో అన్ని కథలకన్నా, మీ కథే నచ్చింది నాకు' అందా కోకిల. కాని నల్లగాలేదు. మంచి ఛాయే. కాటుక పెట్టిన కళ్ళు, ఆ కళ్ళనిండా ఆశ్చర్యమే, వెలుగే.

'చాలా థాంక్స్' అని ఏదో అర్జెంటు పనున్నట్టు 'వస్తానండీ' అని చెప్పి ముందుకెళ్ళిపోయాడు ఎన్నడూ అమ్మాయిలతో – అందులో కళ్ళల్లో ఇంత వెలుగున్న అమ్మాయిలతో – మాట్లాడి ఎఱుగని రామ్మూర్తి.

కాని ఆమె అతన్ని వదల్లేదు.



ప్రథమ బహుమతి. రూ. 50

పి. భవానీ వరప్రసాద్
మెడిసన్ (రెండవ సంవత్సరం)
ఆంధ్రా మెడికల్ కాలేజీ,
విశాఖపట్నం-2.

'ఏమండీ' అని పిలిచి 'ఇవాళ మా ఇంటికి వస్తారా? ... సరదాగా కాఫీ త్రాగుదాం'.

మొదట కొంచెం నివ్వెఱపోయినా తర్వాత అలాగేనని ఒప్పేసుకున్నాడు. ఆమె అతన్ని చాలాసందులు త్రిప్పి కటకటాలున్న ఓ ఇంట్లోకి తీసుకెళ్ళింది. వరండా ప్రక్కనున్న ఓ ప్రక్క రూంలోకి తీసుకెళ్ళి కుర్చీ చూపించింది. అతను కూర్చున్నాడు. ఆమె అతని ఎదురుగా ఓ కుర్చీలాక్కుని కూర్చుంది. ఆమె నెమ్మదిగా ప్రసంగంలోకి దింపింది. కాలేజీ వ్యవహారాలు చర్చించింది. కళ్ళల్లో కళ్ళు పెట్టి మాట్లాడింది. మాట్లాడ్డం మానేసి అదోలా చూసింది. అతను ఇదయిపోయాడు. ఆమె చిర్నగవు చిందించింది. అతనూ చిందించాడు. ఆమె 'వుండండి, కాఫీ తెస్తాను' అంటూ లోపల కెళ్ళింది. అతను ఊపిరి పీల్చుకున్నాడు.

టేబులుమీద గడియారం టక్ టక్‌మంటోంది. ఇంతలో అడుగుల చప్పుడు వినిపిస్తే తలుపు కేసి చూశాడు. ఎంబాసిడర్ బూటు మెత్తగా చప్పుడు చేసుకుంటూ, వస్తోంది. వాటిల్లో గొట్టం ప్యాంటులో ఇమిడిపోయిన కాళ్ళు బలిష్ఠంగా ఉన్నాయి. మడతలు పెట్టిన శ్లాక్ చేతుల్లోంచి కండలు పొంగినట్టు కన్పిస్తున్నాయి. పేనిన కొబ్బరి తాడులాంటి మీసంమీద ముక్కు పొడుగ్గా ఉంది. చూపులు తీక్షణంగా ఉండడంతో అతని కళ్ళల్లోకి చూడబోయిన రామ్మూర్తి, చూడలేక కళ్ళు దించేసుకున్నాడు. అతను రామ్మూర్తివైపు, తీక్షణంగా చూసి కాళ్ళు బల్లమీద పెట్టి, కుర్చీలో కూర్చుని,

'వాట్ మిష్టర్ ... ఏం చదువుతున్నావ్' అని అడిగాడు బొంగురు కంఠంతో.

'బి య్యే స్సీ.' తడబడకుండా చెబుదామని చాలా ప్రయత్నం చేశాడు.

'బియ్యేసియా' అన్నాడు ఒత్తి పలుకుతూ. 'ఆస్తి ఎంతుందేవిటి?' అతనివైపు చూడకుండానే అడిగాడు.

'ఏమీ లేదండి'

అతను నిశ్శబ్దంగా ఆ కుర్చీలోంచి లేచి రామ్మూర్తి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. హేళనగా నవ్వుతూ 'నువ్వు బికారివి ... లక్షాధికారి బిడ్డనే వల్లో వేసుకుందామని వచ్చావ్? ... మిష్టర్. దురాశ దుఃఖానికిచేటు.'

రామ్మూర్తికి కోపం వచ్చింది.

'ఇంతకీ మీ రెవరు?' అడిగాడు మర్యాదగానే.

అతని కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. రామ్మూర్తిని కుర్చీలోంచి లేపి 'స్కౌండ్రల్... నన్నే నువ్వెవరవని అడగడానికి నీకెన్ని గుండెల్రా' అన్నాడు మొహంలో మొహంపెట్టి. రామ్మూర్తినోట మాటరాలేదు. అతని గుప్పిట్లో చొక్కా యమయాతన పడుతోంది. 'గెటౌట్ ... మళ్ళీ మా చెల్లాయి మొహం చూశావంటే...' తోసేశాడు తలుపువైపు. తల తలుపుకి కొట్టుకుంది. స్పృహ తప్పింది. —గొల్లుమం నవ్వులు వినిపించాయి. స్పృహ వచ్చింది రామ్మూర్తికి.

'మిష్టర్ రామ్మూర్తీ — వాట్ ఆర్ యూ డూయింగ్?' మైండ్, డిసీజ్ నాట్ యువర్ హోం టు స్లీప్, సిడ్డౌన్' అంటూ కేకలేశాడు లెక్చరరు. బేల ముఖం వేసుకుని కూర్చున్నాడు రామ్మూర్తి.

క్లాసయిపోయింది. రామ్మూర్తికి బాధగా వుంది. తను ఎంత నిద్రపోతుంటేమాత్రం క్లాసులో అమ్మాయిలముందు ఇన్సల్టు చేస్తాడా? అంతా వెళ్ళిపోయారు. రామ్మూర్తి లేచాడు నీరసంగా. ఇంతలో క్లాసుమేటు సంధ్య



నవ్వుతూ అతన్ని సమీపించి కంగ్రాచులేషన్స్ 'రామ్మూర్తి గారూ!' అంది. ఈసారి రామ్మూర్తి నిజంగా ఆశ్చర్యపోయాడు. 'చాలా బాగా వ్రాశారండీ. మేగజైనులో అన్ని కథలకన్నా మీదే నచ్చింది నాకు.' కోకిల్లా ఉంది కంఠారావం. వెంటనే అతను ఆమె వెనకవైపు జడకేసి చూశాడు అనుమానంగా. కొత్తిమీరకట్ట జడ! రామ్మూర్తికి మతిపోయింది. 'మీ నోట్సు ఓసారి ఇస్తారా?'

తన పుస్తకాల్లోంచి నోట్సుతీసి ఇవ్వబోయి మళ్ళీ చెయ్యి లాగేసుకున్నాడు వెనక్కి. సంధ్య భ్రుకుటి ముడివడింది. రామ్మూర్తి మెల్లిగా అడిగాడు.

'మీ కెవరైనా అన్నయ్య ఉన్నాడా?'

□□□